వింటింటి లెక్చర్లు (1)

## (సోషలిజం బిగిన్స్ ఎట్ హోమ్)

పాత గోడల్ని కూలిస్తే దాని అడుగున శ్రేష్ఠమైన పాటిమన్ను దొరుతుంది. మనప్రాచీన ఆర్ష ఆర్యవైదిక సంప్రదాయపు గోడల్ని కూలిస్తే కూడా భావివంట పొలాలకు పనికివచ్చే ఎరువులాటి పాటిమన్ను విశేషంగా లభిస్తుందిట? రేపటి తరం కుర్రవాళ్ళు పాటిమట్టి కోసం కులం గోడలను సంప్రదాయాల పునాదులను తప్పకుండా తవ్వి టాస్సీటర్వే చేస్తారు. అందుకు విచారించటం శుద్ధదండగ. పాత గోడల్ని బోటుపెట్టి నిలబెట్టాలనుకునే ఛాందసులు కూడా ఆ మట్టిలో కప్పబడిపోయి రేపటి తరం పండించే బంగారుపంటలకు మంచి ఎరువుగా సప్లయి అవుతారు. ప్రపంచమంతటా ఇది జరుగుతోంది. ఇది జరక్కపోతే ఇక మనకు ఇక్కడ ఈ పుణ్యభూమిపై భవితవ్యం కల్ల?

మనవారికి మట్టిగోడలంటే పరమప్రీతి. సిమెంటు కాంక్రీటు యుగం అవతరించినా "మట్టిగోడల్ని" స్మరిస్తూ చిన్మయానందం పొందుతూ ఉంటారు. సాంకేతిక విజ్ఞానాభివృద్ధి వలన కలిగిన ఫలితాలన్నీ వాడుకొని గతం వైపు మొగం తిప్పుకొని ఇసుకలో తలదూర్చి నివసించే ఉష్ట్రపక్షిలా వుంటారు మనవాళ్లు. టెలిఫోన్, విద్యుచ్ఛక్తి రైలు, చిన్నకారు, బస్సు, సినిమా, ఫోటోగ్రఫీ, మైకులు మళ్ళీ అన్నీ వాడకుండా వుండలేరు ఫారిన్ చదువులంటె మక్కువ. ఫారిన్ ల్లేడ్లుకాని

తెగవు. నెక్ పైదగ్గర్నుంచి. టైలు, జోళ్ళు, మేజోళ్ళు. వాచీలు, వాచీస్ట్రాప్‌లు. బెల్టులు, కలాలు, కళ్ళజోళ్ళు, చేతిరుమాళ్ళు అన్నీ ఫారిన్‌వే కావాలి. వీటికోసం కుక్కల్లా ఎగబడ్డం మానరు. మళ్ళీ మనకి ప్రాచీన ఆర్యవైదిక సంస్కృతి ప్రాశస్త్యాన్ని గురించి లెక్చర్లు కొట్టడం మానరు. ఇప్పుడు మన నిత్యజీవితాన్ని పరిశీలిస్తే వేషభాషల్లో వృత్తుల్లో వ్యాపారవ్యవహారాల్లో "మనది మన పద్ధతి" అని చెప్పుకో తగినదేదీలేదు. ఫారిన్ మంచాలు. ఫారిన్ బ్లేడ్లు, తలగడలూ దుప్పట్లు కావాలి మన వారికి. ఎంత ఆధునికంగా జీవిస్తున్నా ఈ ఆధునిక జీవితాన్ని సమకూర్చిన తత్వాన్ని ఆమోదించేందుకు మనవారు సిద్ధంగా లేరు. ఫెల్ట్‌హాట్ మీద గుండు చెంబు బోర్లించాలని చూస్తారు. విస్కీసీసా మీద విభూదిపండు పెట్టినట్లు.

వీకెండ్ పిక్నిక్కులు ఈవినింగు పార్టీలు ఎంత జోరుగా వెళ్ళి జరుపుకుంటారో. అంతకు రెండింతలు భక్తితో తిరుపతి వెళ్లి గుండ్లు కొట్టించుకుని వస్తారు. ఫుల్ సూట్ మీద ఉన్న వ్యక్తి నుదుటను విభూది పెండికట్లు ఆశ్చర్యం కలిగిస్తాయి. పాతతో తెగతెంపులు చేసుకోనలేక కొత్త ఆకర్షణలను అనుభవించకుండా వదలలేక ఒక అయోమయ స్థితిలో మనం జీవిస్తున్నాము. మన ముందు తరం వాళ్ళు మనకంటె ప్రాక్టికల్‌గా వుంటారు. వాళ్ళ ధ్వంసం చేసేది పాత ఆచారాలను, పాత అలవాట్లను, పాత నమ్మకాలనూ. ఎంతవారైనా నశించిపోయేదానికి ప్రాణం పోయ లేము- రానున్న దానిని అడ్డుకోలేరు. దేవుళ్ళబలం తగ్గి బలం జనం మీద పనిచేయటం మంచిదా లేదా? దేవుడి కంటికూడా ముఖ్యమైంది డబ్బు డబ్బుకున్న పవర్ని లాగేసేందుకు ఏం చేయాలి? డబ్బు ఒకచోట చేర కుండా చేయాలి? నీరు పల్లానికి ప్రవహించినట్లు డబ్బు జనంలోకి ఎక్కువ మందిలోకి వెళ్ళాల్సిందే కదా! సంపదని డబ్బు సృష్టించటం లేదు. శ్రమ శక్తి ప్రజలందరిది. ప్రజలు సృష్టించిన సంపద ప్రజలలోకి వెళ్ళటం న్యాయంకదా? ఏ ఒక్కరో లేక ఏ కొందరో, పెట్టుబడి తమదని చెప్పే సంపదలో ఎక్కువ భాగాన్ని కైంకర్యం చేయటాన్ని ఎలా ఆపుచేస్తాము.

ఆర్థిక విధానాలు మార్చటం వలన, ఎవరు మారుస్తారు? ప్రభుత్వం. ప్రభుత్వం అంటే ఎవరు? ప్రజలు, ఇన్నాళ్ళూ ప్రజలు మోసగింపబడు తున్నారు. ఇక ముందు అలా జరగ కూడదు. అడ్డుగోడలుంటే వాటిని పడగొట్టాలి. అయ్యో ఇది మా తాత కట్టించిన గోడ. ఇది మా ముత్తాత కట్టించిన గోడ అని జాలిపడకూడదు.



గోడ అనేది ఒక నిర్జీవపదార్థం. దానికి చలనం లేదు. సిమెంటుతో కట్టినదైనా, సున్నం యిటుకలతో కట్టినదైనా మన్ను పిసికి కట్టినదైనా గోడ గోడే-గోడల్లో చాలా చిన్నదానిని పిట్టగోడ అంటారు. గోడలు నిజంగా చాలా ఎత్తుగా బలంగా వుండి మన్ని భయపెడతాయి. గునపంతో ఒకపోటు పొడిస్తే అది కూలుతుంది. గునపంతో గోడని పోడవటం

హింసకదాని మనం భయపడితే అది అలానే వుంటుంది. జైలు గోడల్ని మనం ప్రేమించలేముకదా. ఫ్యాక్టరీ గోడల మధ్య. ఆఫీసు గోడల మధ్య ఏం జరుగుతుందో. పెద్ద పెద్ద గోడల వెనుక దాక్కున్న పెద్ద పెద్ద మేడలలో భవంతులలో ఏం జరుగుతూవుంటాయో, వాటి ఫలితాలను అనుభవించేదిపాపం సామాన్య ప్రజలు. గుళ్ళో దేవుడుంటాడు, పూజార్లూ, స్వాములార్లూ, భక్తులూ వుంటారు. పోలీసులు పోలీసుస్టేషన్లో వుంటారు. డ్యూటీల్లో వుంటారు. బాబూజీలు ఆఫీసుల్లో వుంటారు. వాళ్ళందరి కోసం కష్టపడేది పంట పండించేది వస్తువుల్ని తయారు చేసేది సేవలందించేదీ ఎవరు? గనిలో పనిలో పనిలో కార్ఖానాలో అన్నట్లు—రైతు, కార్మికుడు. కూలీ, మరొాడూ వీళ్ళంతా "హ పెనీ టపెనీ" గాళ్లు. వీళ్ళ భవిష్యత్తుని మార్చేసేవి ఆ పైవాళ్ళే .... హైక్లాసువాళ్ళు. "లో" క్లాసువాళ్ళు తిరగడం విప్లవం. హైక్లాసువాళ్ళు క్రింది వాళ్ళను దోచుకు తినడం "ప్రజాస్వామ్యం—న్యాయపరిపాలన."

నీటికి ఎంత శక్తి వుంది? ప్రవాహానికి ఎంత బలం వుంది? వర్షానికి ఎటువంటి ఫోర్సువుంది. ప్రజలు నీటి బిందువులాటి వాళ్ళు. వారు సముద్రం లాటి వారు వారిలో కలగవలసిన చైతన్యం కలిగినప్పుడు కెరటాలే విరుచుకు పడతాయో, ఉప్పెనలే వచ్చి ముంచెత్తి వేస్తాయో, ప్రభంజనమే వీస్తుందో, తుఫానులే వస్తాయో ఎవరు చెప్పగలరు? అప్పుడు గోడలు పునాదుల్తో సహాకూల వలసిందే కదా-పర్వతాలకు రెక్కలు విరగ వలసిందే కదా-ఆకాశం వంగి భూమిని స్పృశించాల్సిందే కదా—చెట్లు తల లూపాల్సిందే కదా—అగ్ని వర్షం కురవాల్సిందే కదా—

సాహిత్యం లలితకళలు, సినిమా, వాణిజ్యం వగైరా వగైరాలు "హ పెనీ టపెనీ"గాళ్ళ కోసం కాదు. క్లాసు పురుషుల కోసం అని చెప్పి మర్మజ్ఞులు చాలా మంది గౌరవనీయులుగా కితాబు అందుకుంటున్నారు. విద్యని విజ్ఞానాన్నీ కూడా వారు క్రిందికి ప్రవహించనివ్వరు.

జ్ఞానాన్ని పంచుకోడానికి కూడా వాళ్లు చెప్పేఅర్హతలుండా లంటారు. సంపదనీ, జ్ఞానాన్ని ఎవరికీ యివ్వనివ్వరు. దీనికి బలమైన సపోర్టు మన ఆడవాళ్ళే—వారికివేమీ తెలియవు. తెలియకుండా వారు సంప్రదాయాల్నీ ఆచారాలనీ అలవాట్లనీ బలపరుస్తూ అభివృద్ధిని వ్యతిరేకిస్తున్నారు. మార్పులకి అడ్డు తగుల్తున్నారు. సమస్యలకు కారణమవుతున్నారు. సోషలిజం బిగెన్సెట్ హోమ్!